# అందరూ అందరే!

**బాలం వెంకట్రావు**

అది ఇంపోర్ట్స్ అండ్ ఎక్స్‌పోర్ట్స్ ఆఫీసు. అందులో కొందరు గుమాస్తాలు. ఆ గుమాస్తాల మీద 'స్వారీ' చేయటానికి ఓ మేనేజరు, పేరు—మేనక! ఈ రోజుల్లో ఉద్యోగాలు చేసేవారు కొందరికి సైడు బిజినెస్సులు నడపటం అలవాటు. అలాగే ఆ గుమాస్తాలకీ సైడు బిజినెస్సులున్నాయి.

ప్రమోద్‌కి పెళ్లి సంబంధాలు చూడటం, పెళ్లిళ్లు కుదర్చడం సైడు బిజినెస్సు (ప్రమోద్ పేరు తర్వాత 'ప్రమాదం'గా మారిపోయింది).

రామేశం సైడు బిజినెస్సు —వాస్తు చూడటం, జ్యోతిషం చెప్పడం (ఎవరూ ఇవ్వకపోయినా 'వాస్తురత్న' బిరుదు తనే తగిలించుకున్నాడు).

కార్తీక్ సైడు బిజినెస్సు చెట్టు కింద ప్లీడరీ (విడాకుల కేసుల్నే చూస్తాడు).

సంతోష్‌కు సైడు బిజినెస్సు లేదు, పేరుకు తగ్గట్టుగా కూడా ఉండడు (కాలక్రమంలో సత్యవాదిగా మారిపోయాడు)

**2**

ఒక రోజు ఉదయం సహచరత్రయం (కా. రా.ప్ర.) క్యాంటీన్‌లో కలుసుకున్నారు.

"పొద్దున్నే ఓ దిక్కుమాలిన సంబంధానికి వెళ్లొచ్చాను. పెళ్లికొడుకు డిగ్రీయేమో ఫస్టు క్లాసులో ఫెయిలయ్యాడు. అందమేమో చెక్కిన అరటికాయలా ఉంది. ఇలా ఉంటే ఏం చేయను నా బొంద?" అన్నాడు నిరాశగా ప్రమాదం.

"ప్చ్! పరీక్ష గురించి చింతవద్దు. ఇప్పుడు ఎక్కడంటే అక్కడ ఏ సర్టిఫికేట్లు కావాలంటే ఆ సర్టిఫికెట్లు రెడీగా దొరుకుతున్నాయి. నేను చదివిన 'లా'—పరీక్షల్లో నెగ్గలేక 'ఒక సర్టిఫికేటు' కొనుక్కున్నాను. నీక్కూడా కావాలంటే చెప్పు..." కార్తీక్ ప్రమాదం ముఖంలోకి చూశాడు.

"అవి నాకొద్దులే! అన్నట్టు ఈ మధ్యన ఒక జంట విడాకులకి వచ్చిందన్నావుగా, ఆ అబ్బాయిని నా వద్దకు పంపు. ఇంకో మ్యాచ్ ఫిక్సింగ్ చేస్తాను" అన్నాడు ప్రమాదం.

"తొందరెందుకు? నువ్వు కుదిర్చిన జంట ఇంకొకటి ఉందిగా. అది కూడా నేను చూశాక ఒక్కసారే మ్యాచ్ ఫిక్సింగ్ చెయ్యి" -కార్తీక్.

"అన్నట్టు డిస్కౌంటు ఇచ్చినా బిజినెస్‌ని అభివృద్ధి చేద్దామనుకుంటున్నాను" గర్వంగా అన్నాడు ప్రమాదం.

"కావాలంటే నా సాయం కూడా తీస్కో! నకిలీ సర్టిఫికేట్లు—బోగస్ పాస్‌పోర్టులు—బోగస్ ఇమ్మిగ్రేషన్—దొంగసాక్షులు—దొంగ సంతకాలు..." కార్తీక్.

వారి సంభాషణ అలా సాగుతుండగా అప్పటి వరకూ ఓపిగ్గా ఉ (వి) న్న రామేశం భళ్లున గొంతు విప్పాడు.

"ఇంక ఆపండి మీ సొద! కాలాతీతమైంది. ఆఫీసులోకి అడుగు పెట్టే ఘడియలు ప్రవేశించాయి. పదండి" అన్నాడు, గద్దించినట్టుగా.

రామేశం గర్జనకు ప్రమాదం, కార్తీక్‌ల నోళ్లు మూతపడ్డాయి. అందరూ వరండాలోకి వచ్చారు. ప్రమాదం, కార్తీక్ లిఫ్టులోకి నడిచారు.

"ఇది 'లిఫ్టుల' కాలం అయిపోయింది గాని అందులోనే 'తెప్పులు' కూడా జరుగుతున్నాయని గమనించట్లేదు. మెట్లే శ్రేయస్కరం" అంటూ, తనూ ఎక్కాడు రామేశం, తలుపులు మూత పడి లిఫ్టు నడక ఆరంభించింది. ఇంతలో అకస్మాత్తుగా విద్యుత్తు ఆగిపోయింది. చీకటి ఆవరించింది. అందరి పైప్రాణాలూ పైనే పోయాయి. లిఫ్టులో యువకులతో పాటు కొంత మంది యువతులు కూడా ఉన్నారు. లిఫ్టు ఆపరేటర్ గట్టిగా కేక వేశాడు. ప్రతిగా బయటి నుంచి అరపు వినిపించింది. అలా లోపల్నుంచి—బయట్నుంచి—అరుపులు వినిపిస్తూనే ఉన్నాయి. ఈ గందరగోళం నేపథ్యంలో కా. రా. ప్ర. ల మనస్సుల్లోంచి ఏవేవో ఆలోచనలు పుట్టుకొచ్చాయి.

'సందట్లో సడేమియాలా ఎవరైనా ఈ అమ్మాయిల్ని ఏమైనా చేసి అది పక్కనున్న తన మీద పెడితే కేసు ఎలా 'డీల్' చేయాలి?' అని కార్తీక్ ఆలోచిస్తున్నాడు.

'ఒక వేళ అమ్మాయిల్ని అబ్బాయిలు అల్లరి చేస్తే అదే వంక పెట్టి ఇద్దరికీ ముడి పెట్టి పెళ్లి సంబంధం ఎలా కుదిర్చేయాలి' —అని ప్రమాదం తెగ ఆలోచిస్తున్నాడు.

ఇక రామేశం ఆలోచనాసరళి మరోలా ఉంది.

'ఇది ఎంతో గొప్ప సమయం. కొత్త వధూవరులు గదిలో గడిపే తొలి రాత్రి వంటిది ఈ చీకటి...'

వాళ్ల ఆలోచనలు అలా సాగుతుండగా— లిఫ్టు ఆపరేటర్ ప్రయత్నాల ఫలితంగా దభాల్న తలుపులు తెరుచుకున్నాయి. ఇప్పుడు లిఫ్టు రెండు అంతస్తుల మధ్యన ఉంది!

"యమగండంలో ఎక్కాం, చిక్కుకుపోయాం!" అంటూ గొణిగాడు రామేశం.

ఆయాసపడుతూ, ఒకరి తర్వాత ఒకరు ఎక్కి ఎలాగో పైకి చేరుకున్నారు. రామేశం మళ్లీ దండకం మొదలెట్టాడు. కా. ప్ర. చెవులు మూసుకున్నారు.

"అసలు లిఫ్టుని కూడా వాస్తుప్రకారం నిర్మించాలి. విద్యుత్తు ఆగిపోతే జరగకూడనివి జరిగే అవకాశం ఉంది. యువతులకైతే తేళ్లూ, జెర్రులూ పాకే ప్రమాదం—యువకులకైతే డబ్బు దస్కం పోగొట్టుకొనే ప్రమాదం పొంచి వున్నాయి. అందువలన లిఫ్టులో కెమెరాల్ని అమర్చాలి. దాని వల్ల ఆడైనా, మగైనా నిర్భయంగా వుండగలుగుతారు. లేకపోతే ఇలాగే జరుగుతుంది. ఒకసారి శుభమా అంటూ ఒక జంట కోరిక మేర పెళ్లి ముహూర్తం పెడితే, పెళ్లి జరగాల్సింది చావు జరిగింది. ఇంకో జంటకైతే తాంబూలాలు పుచ్చుకున్న వెంటనే తన్నుకోవటం మొదలెట్టి చెరో వైపు ఇద్దరేసి చొప్పున కటకటాల పాలయ్యారు. గృహప్రవేశానికి ముహూర్తం పెడితే అపార్ట్‌మెంట్ కూలిపోయింది!"

ఉన్నట్టుండి ప్రమాదం, కార్తీక్ గట్టిగా అరిచారు.

"ఇంక నీ పంచాంగం ఆపకపోతే నువ్వు అయిపోతావ్?" రామేశం నోరు మూసేశారు. అందరూ సెక్షనులోకి వెళ్లి తమ తమ పనుల్లో మునిగిపోయారు.

**3**

"ఫైళ్లలో ఏమిటీ రాతలు? 'వైరుల్ని' ఎక్స్‌పోర్ట్ చేయాలని రాయమంటే 'వరుల్ని' ఎక్స్‌పోర్ట్ చేయాలని రాశారు. మా కంపెనీకి 'డ్రైవర్స్' కావాలి అని ప్రకటన ఇవ్వకుండా 'డైవోర్సు కావాలా? మా ఆఫీసులో సంప్రదించండి' అని రాశారు. మీరు ఇక్కడ చేసేది ఆఫీసు పనా? లేక మీ సొంత వ్యాపారాలా?" అంది, మండిపడుతూ మేనేజరు మేనక.

ప్రమాదం, కార్తీక్ ఖంగు తిన్నారు, ఈ హఠాత్పరిణామానికి. ఒకరి ముఖాలు ఒకరు చూసుకున్నారు.

మేనక మళ్లీ మొదలెట్టింది. "రామేశం! నిన్ను ఉదయమే రైల్వే స్టేషన్‌కి వెళ్లమన్నాను. ఇప్పుడొచ్చావ్..."

"సారీ మేడమ్! అనుకోకుండా నా మిత్రుడు పెంచుకుంటున్న టామీ (కుక్క) కి చిన్న ఇల్లు కడుతుంటే వాస్తు చెప్పటానికి వెళ్లాల్సి వచ్చింది. అందుకే..." సాగదీస్తూ అన్నాడు రామేశం.

మేనక వెంటనే సంతోష్ వద్దకు దూసుకెళ్లింది. "బ్రోకర్ అండ్ బ్రోకర్ కంపెనీ కంట్రాక్టు సంగతి ఏమైంది?" అంది గట్టిగా అరుస్తూ.

"మీకు ఆ ఎం.డి. పది శాతం కమీషన్ (మామూలు) ఇస్తానన్నాడట కదా? ఆ విష

యం.." అని సంతోష్ చెప్తూండగానే నిప్పు కణికకు నీరు తగిలినట్టు మేనక చప్పున చల్లబడిపోయింది.

"ష్!.. నెమ్మది!" అంటూ అతని దగ్గరగా వచ్చింది. "ఇలాంటి విషయాలు ఇక్కడ మాట్లాడకూడదు సంతోష్" అంది ఎంతో నమ్రతగా. కొన్ని క్షణాల తర్వాత, నెమ్మదిగా అక్కణ్నుంచి జారుకుంది మేనక.

సాయంకాలసమయం.

సంతోష్, మేనక గదిలోకి వెళ్లాడు. ఆమె నవ్వుతూ ఆహ్వానించింది. సంతోష్ ఎంతో వినయంగా నిలబడ్డాడు.

"మనం కొన్ని విషయాలు బహిరంగంగా మాట్లాడకూడదు. వాటిని గోప్యంగా ఉంచాలి సంతోష్" అంది, ఎంతో ఆప్యాయతని ఒలకబోస్తున్నట్టుగా, సంతోష్‌కు సంతోషం కలిగింది.

"ఫీవర్ ఇన్ ఫింగర్. హెడేక్ ఇన్ స్టమక్. రేపు సెలవు కావాలి మేడమ్" అన్నాడు జాలి గొలిపేలా.

ఆమె కనురెప్పలు టపటపలాడించి సంతోష్‌కేసి వింతగా చూసింది. "నాకూ జ్వరంగానే ఉంది. ఏం చేయను? రేపు అర్జెంటు పని ఉంది. సెలవు కుదర్దు" అంది.

సంతోష్‌కు సగం సంతోషం ఎగిరిపోయింది. ఆ స్థానంలో 'కోపం' ప్రవేశించింది. 'ఈ కూల్ డ్రింక్ సీసాతో నీ నెత్తి పగలకొడ్తా!' అని అనబోయాడు గాని, అనలేదు. పళ్లు పటపట కొరుకుతూ బయటికొచ్చేశాడు. విషయాన్ని సెక్షనులో అందరికీ చెప్పాడు. అందరూ ఏకగ్రీవంగా ఇలా తీర్మానించారు.

"మేనక మనిషి కాదు, శాడిస్టు!"

"ఆమెకి మానవత్వం లేదు! ఆ మాటకొస్తే ఆమెకి అసలు సభ్యతే తెలీదు" అన్నారు ముక్తకంఠంతో.

## 4


ఓ రోజు ఉదయం, సహచరబృందం (రా.ప్ర.కా.సం.) క్యాంటీన్‌లో కలిశారు. సంతోష్ ఆనందంతో మాట్లాడుతున్నాడు.

"స్త్రీలు తమ మనసులోని భావాలు, బాధల్ని ఎప్పుడూ దాచుకోకుండా బైటికి చెప్పేయటం వలన వారిలో ఒత్తిడి ఉండదట. అందువలన వారిలో గుండె జబ్బులు వచ్చే అవకాశం తక్కువట. కాని, పురుషుల్లో మానసిక ఒత్తిడుల వలన ఎక్కువ మందికి గుండె జబ్బులొస్తాయట. అంచేత మనసులోని సందేహాలు, బాధలు ఎన్ని ఉన్నా పక్కవారికి చెప్పుకోవటం ఆరోగ్యానికి మంచిది. ఇదంతా నిన్న పేపర్లో చదివాను. నేను కూడా అలాగే చేద్దామనుకుంటున్నాను. ఆరోగ్యానికి మంచిది కదా!" అంటూ అందరికేసి చూశాడు సంతోష్.

సంతోష్ సంతోషంగా అలా మాట్లాడేటప్పటికి, మిగతా ముగ్గురికీ మూర్ఛ వచ్చినంత పనైంది. తర్వాత తేరుకొని అందరూ ఆఫీసుకి చేరుకున్నారు. ఎవరి పనిలో వారు మునిగిపోయారు.

గంట గడిచింది. లైట్లు వెలుగుతున్నాయి. ఫ్యాన్లు తిరుగుతున్నాయి. ఉన్నట్టుండి నిశ్శబ్దం ఛేదించబడింది. ఆ గొంతు సంతోష్‌ది.

"మేనేజరు మేనక బండారం బట్టబయలు చేస్తా! మేనక కోయంబత్తూరు కేసులో కంట్రాక్టర్ క్రిస్టోఫర్‌తో లాలూచీ పడి కోటి రూపాయలు కొట్టేసింది. మొన్న బ్రాందీ డీలరు బంగారయ్య దగ్గర లక్ష తీసుకుంది. 'కపటం కంపెనీ'కి చెందిన ఖరీ



దైన డ్రగ్స్ కొన్నింటిని దారి మళ్లించేసి, షాపులకు అమ్మేసుకుంది. డబ్బు తీసుకుని చెప్పకూడని ఎన్నో వ్యాపారరహస్యాలు బయటివారికి చెప్పేసింది. ఇంకా..."

సంతోష్ నాన్-స్టాప్‌గా చెప్పుకుపోతున్నాడు. సెక్షనులో అందరూ ఆనందంగా వింటున్నారు.

మేనక మాత్రం కళ్లు తేలేసి కిటికీ లోంచి చూస్తోంది.

"వీడు పెళ్లిళ్ల పేరయ్య. డబ్బు గుంజి, అబద్ధాలు ఆడి కుదిర్చిన సంబంధాల్లో ఏ జంటా కూడా సరైన కాపురానికి నోచుకోలేదు. వీడు కార్తీక్, దొంగ సర్టిఫికెట్‌తో లాయరు ప్రాక్టీస్ పెట్టాడు. వీడి క (పె) న్ను పడితే జంట విడిపోవలసిందే! ఇంక రామేశం. మనుషుల్నే మింగేస్తాడు. వీరు ముహూర్తం పెడితే పైలోకాలకు వెళ్లిపోవటమో కాలో, చెయ్యో, పోగొట్టుకోవటమో, జరగాల్సిందే!..." ఎంతో ఆవేదననీ, అక్కసునీ వెళ్లగక్కేసి, గుండె బరువుని దించేసుకుని హాయిగా ఊపిరి పీల్చుకున్నాడు సంతోష్.

మేనకతో సహా అందరికీ మతులు పోయాయి. సంతోష్‌ని నమిలి మింగేసేలా చూస్తూ, మనసులో తిట్టుకోవటం ఆరంభించారు.

వాళ్లు తేరుకునేలోగా, సంతోష్ గబగబా ఆఫీసు లోంచి బైట పడ్డాడు. బజార్లో పని చూసుకుని ఉల్లాసంగా ఇంటికి చేరుకున్నాడు. ఈల వేసుకొంటూ ఇంట్లోకి ప్రవేశించిన సంతోష్ అక్కడే నిలబడిపోయాడు.

అశోకవనంలో సీతలా దిగులుగా కూర్చొని ఉంది భార్య.

"ఎవరైనా ఉన్నది ఉన్నట్టుగా మొహం మీద మాట్లాడుతారటండీ?"—నిలదీసింది ఆమె.

ఆ మాటలు విని సంతోష్ ఆశ్చర్యపోయాడు. సంగతి అర్థమైపోయింది.

"ఆఫీసులో మీరు అన్నమాటలు నాకు తెలిశాయి. నోటి కొచ్చినట్టు అంటే ఎవరైనా ఊరుకొంటారా? ఉద్యోగం నుంచి వెళ్లగొట్టరా?" లబోదిబోమంది ఆమె. బెంగ పెట్టుకొని మంచం ఎక్కింది. ఉన్న నీరసం ఎక్కువై, గుండె నీరసం బైట పడింది ఆమెకు.

భార్య స్థితిని చూసిన సంతోష్‌కి మతి పోయింది. అప్పటి దాకా హాయిగా—ఎంతో తేలిగ్గా వున్న అతని మనసు, క్షణాల్లో బరువెక్కిపోయింది.

ఇక లాభం లేదని భార్యని ఒక పెద్ద ఆసుపత్రికి తీసుకువెళ్లాడు. డాక్టర్లు మందుల మీద మందులు రాసేసి వైద్యం 'గట్టిగా' చేసేశారు.

రెండ్రోజుల తర్వాత ఆమెకు గుండె జబ్బు తగ్గింది. కాని, ఆసుపత్రి బిల్లు చూశాక సంతోష్‌కి గుండె పోటు వచ్చింది!

ఆ రోజు ఆఫీసు గందరగోళంగా ఉంది. ఎన్నో అవినీతి, అక్రమాలు జరిపినందుకేమో మేనకకు, 'ఏరియా మేనేజరు'గా ప్రమోషన్ ఇచ్చారు!

ఇక మేనక కొత్త ఆఫీసులో చేరటానికి రామేశం 'మంచి దుర్ముహూర్తం' చూసి పెట్టాడు, ఉచితంగా!

చిత్రంగా రామేశం చెప్పిన జోస్యం అక్కడ తిరగబడి, కొన్ని నెలలకే మేనక 'డివిజినల్ మేనేజర్' అయి కూర్చొంది!

అయితే—

మేనక మీద కన్నేసిన (అందం చూసి కాదు) ఉన్నతస్థాయి అధికారులు, ఆమె అక్రమసంపాదనని వెనక్కి లాగేసుకుని, 'రివర్షన్'ని బహుమతిగా ఇచ్చి, ఆమెని ఓ కుగ్రామానికి విసిరేశారు.

ఇక సైడు బిజినెస్సులు చేసే కా.రా.ప్ర.లను తలో చోటికీ బదిలీ చేస్తూ ఉత్తర్వులను వారి చేతుల్లో పెట్టారు, ఎంతో మర్యాద చూపుతూ. ●